# పాటల్లేకుండా ప్రయోగం



కమర్షియల్ సినిమాల్లో పాటలు తప్పనిసరి. గతంతో పోల్చితే నేటి సినిమాల్లో పాటల సంఖ్యను తగ్గించారు. పూర్తిగా పాటలు లేకుండా సినిమాలు తీయడం చాలా అరుదు. అలాంటి అరుదైన ప్రయత్నమే చేయనున్నారు అగ్రహీరో విజయ్ దేవరకొండ. అసలు పాటలే లేకుండా సినిమా చేయనున్నారాయన. వివరాల్లోకి వెళితే.. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఇన్నోవేటివ్ కాన్సెప్ట్‌తో తీస్తున్న ఈ సినిమాలో విజయ్ దేవరకొండ గూఢచారి పాత్రలో కనిపించనున్నారని తెలిసింది. అయితే ఈ సినిమాలో కథానుగుణంగా పాటల అవసరం లేదట. కేవలం బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ మాత్రమే ఉంటుందట. అనిరుధ్ రవిచందర్ ఈ సినిమాకు మ్యూజిక్ డైరెక్టర్. ఆయన ట్యూన్స్‌కు సంగీతప్రియుల్లో మంచి ఫాలోయింగ్ ఉంది. అలాంటి మ్యూజిషియన్ పాటలు లేకుండా సినిమా చేయడం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. కథ తాలూకు ఎమోషన్‌ను డిస్టర్బ్ చేయకూడదనే ఉద్దేశ్యంతో పాటలు వొద్దనుకున్నారని అంటున్నారు. అక్కడక్కడా బిట్‌సాంగ్స్ వినిపిస్తాయని, ప్రత్యేకంగా పాటలు మాత్రం ఉండవని చెబుతున్నారు. శుక్రవారం నుంచి ఈ సినిమా తాజా షెడ్యూల్ విశాఖపట్నంలో మొదలుకానుంది.

# తమన్నాపై కేసు నమోదు



అగ్ర కథానాయిక తమన్నాపై మహారాష్ట్ర సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివాదాస్పద ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ ప్లాట్‌ఫామ్ మహాదేవ్‌కు అనుబంధ యాప్‌గా ఉన్న ఫెయిర్ ప్లే కోసం తమన్నా ప్రచారకర్తగా పనిచేసింది. ఈ యాప్ ద్వారా ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ మ్యాచ్‌లను ప్రసారం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఐపీఎల్ అధికారిక బ్రాడ్‌కాస్టింగ్ సంస్థ జియో సినిమా సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించి తమన్నాపై ఫిర్యాదు చేసింది. ఫెయిర్ ప్లే యాప్‌లో ఐపీఎల్ మ్యాచ్‌లు చూడమని తమన్నా చెప్పడం నిబంధనలకు విరుద్ధమని జియో సినిమా తన ఫిర్యాదులో పేర్కొంది. ఈ కంప్లైంట్‌ను స్వీకరించిన ముంబయి సైబర్ పోలీసులు వచ్చే వారం విచారణకు హాజరుకావాలని తమన్నాకు సమన్లు జారీ చేశారు. మహదేవ్ ఆన్‌లైన్ బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌పై గత కొంతకాలంగా వివాదం నడుస్తున్నది. ఈ యాప్ వ్యవహారాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కేసు నమోదు చేసి దర్యాప్తుని నిర్వహిస్తున్నది. ఈ యాప్ కోసం ప్రచారం నిర్వహించిన రణ్‌బీర్‌కపూర్, శ్రద్ధాకపూర్‌కు ఈడీ గతంలోనే సమన్లు జారీ చేసి విచారణ చేపట్టింది. తాజాగా తమన్నాపై కేసు నమోదు కావడం ఆసక్తికరంగా మారింది.

# ఆ సీన్ ఇబ్బంది పెట్టింది

నటిగా లొకేషన్‌లో ఇబ్బందిపడ్డ సందర్భం ఏమైనా ఉందా? అని ఓ ఇంటర్వ్యూలో అడిగిన ప్రశ్నకు మృణాళ్ ఠాకూర్ ఆసక్తికరమైన సమాధానం ఇచ్చింది. మృణాల్ అభిమాన నటుడు షాహిద్ కపూర్. ఆయనతో కలిసి నటించిన 'జెర్సీ' చిత్రం నాటి ఆన్ లొకేషన్ ఎక్స్‌పీరియన్స్‌ని మీడియా ముందు నెమరువేసుకుంది మృణాళ్. 'నాకు షాహిద్ అంటే పిచ్చి. అలాంటి నాకు వరంగా వచ్చింది 'జర్సీ' ఆఫర్. సంబరపడిపోతూ సైన్ చేశాను. నాకు షాహిద్ నవ్వు అంటే చాలా ఇష్టం. లొకేషన్లో ఆయన నవ్వుతుంటే అలాగే చూస్తూవుండేదాన్ని. ఆయన నావైపు చూసి, ఏంటలా చూస్తున్నావ్? అనడిగారు. 'సినిమాల్లోనే కాదు, రియల్‌గా కూడా మీ నవ్వు చాలా బావుంది' అని చెప్పేశాను. ఆయన నవ్వుకున్నారు. షాహిద్‌తో నటించిన రోజుల్ని జీవితంలో మరిచిపోలేను. అదే లొకేషన్‌లో నేను ఇబ్బందిపడ్డ సందర్భం కూడా ఒకటుంది. కథ రీత్యా నేను షాహిద్‌ని చెంపదెబ్బ కొట్టాలి. తనేమో నా అభిమాన నటుడు. ఆయన్ని కొట్టడం అంటే అంతకంటే శిక్ష వేరొకటి ఉండదు. కానీ కథలో కీలకమైన సీన్.. తప్పదు. అందుకే.. నిదానంగా కొడతాను.. మీరు ఎడిట్ చేసుకోండి అని దర్శకుడు గౌతమ్ తిన్ననూరికి చెప్పాను. ఆయన ఒప్పులేదు. గట్టిగా కొట్టాల్సిందే అన్నారు. షాహిద్ కూడా కొట్టమని బలవంతపెట్టాడు. పైగా 'నీ ఎక్స్ బాయ్‌ఫ్రెండ్‌ను గుర్తుచేసుకో.. గట్టిగా కొట్టెయ్..' అంటూ మోటివేట్ చేశాడు. ఆ ఒక్క సీన్ చేయడానికి మూడు గంటలు పట్టింది. షాట్ బాగా రావడానికి రెండుమూడు సార్లు కొట్టాల్సొచ్చింది. నా జీవితంలో నటిగా నేను బాగా ఇబ్బందిపడ్డ సీన్ అదే' అంటూ చెప్పుకొచ్చింది మృణాళ్‌ఠాకూర్.



# యానిమేషన్‌లో 'కల్కి' ప్రపంచం



'దర్శకుడు నాగ్‌అశ్విన్ ప్రేక్షకులకు కొత్త ప్రపంచం చూపించబోతున్నాడు. కొత్త పాత్రలను పరిచయం చేయబోతున్నాడు. 'కల్కి 2898' ఇండియన్ స్క్రీన్‌పై ముందెన్నడూ చూడని అద్భుతం'. అని ఆ సినిమాకు పనిచేసిన వాళ్లు చెబుతున్నారు. ప్రభాస్ కథానాయకుడిగా రూపొందుతోన్న ఈ చిత్రంలో దీపిక పదుకొణే కథానాయిక. అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దుల్కర్ సల్మాన్‌లతో పాటు మరికొందరు స్టార్లు కూడా ఈ సినిమాలో భాగమైన విషయం తెలిసిందే. 'కల్కి 2898' ప్రభాస్ కెరీర్‌లోనే హైబడ్జెట్ సినిమా. శ్రీమద్భాగవతంలో ప్రస్తావించిన ఓ అంశం ఆధారంగా పురాణపాత్రల నేపథ్యంలో జరిగే ఫాంటసీ, సైంటిఫిక్ థ్రిల్లర్ ఇది. రీసెంట్‌గా ద్రోణసుతుడైన అశ్వద్ధామగా అమితాబ్‌ను మేకర్స్ పరిచయం చేశారు. వందేళ్ల తర్వాతి ప్రపంచరూపం, పరిణామాలూ, పోకడలూ ఇందులో కొత్తగా అనిపిస్తాయని తెలుస్తున్నది. ఈ సినిమా విడుదల తేదీపై ప్రేక్షకుల్లో సందిగ్ధత నెలకొని ఉన్న విషయం తెలిసిందే. మే 9న విడుదల చేయనున్నట్టు వైజయంతీ మూవీస్ సంస్థ కొన్ని నెలల క్రితం ప్రకటించింది. అయితే.. ఆ సమయంలో తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికల వేడి తారాస్థాయిలో ఉంటుంది. అందుకే.. సినిమా విడుదలపై నిర్మాతలు పునరాలోచనలో పడ్డట్టు సమాచారం. త్వరలోనే కొత్త డేట్‌ని ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తున్నది. కాగా, విడుదలకు ముందే, ఈ సినిమాపై ఓ యానిమేషన్ వీడియోను వైజయంతీ మూవీస్ సంస్థ సిద్ధం చేస్తున్నదట. ఆ వీడియో ద్వారా 'కల్కి 2898' ప్రపంచాన్ని ఆవిష్కరించనున్నట్టు వినికిడి. ఇది ఏ తరహా సినిమానో ఆ వీడియోలో చూపించి, ప్రేక్షకులకు ప్రిపేర్ చేయడమే ఈ వీడియో ముఖ్యోద్ధేశమట. ఇప్పటికే ఈ సినిమాపై అంచనాలు ఆకాశంలో ఉన్నాయి. ఈ వీడియోతో అవి మరింత పెరిగే అవకాశం లేకపోలేదు.

# ముంబయిలో 'కుబేర' హంగామా



కెరీర్ ప్రారంభంలో ఆనంద్, గోదావరి, హ్యాపీడేస్ సినిమాలతో దర్శకుడిగా హ్యాట్రిక్ కొట్టారు శేఖర్ కమ్ముల. మళ్లీ ఇన్నాళ్లకు ఆయనకు హ్యాట్రిక్ అవకాశం వచ్చింది. ఫిదా, లవ్‌స్టోరీ చిత్రాల వరుస విజయాలతో మంచి జోష్ మీదున్న ఆయన.. త్వరలో 'కుబేర'తో రాబోతున్నారు. ధనుష్ కథానాయకుడిగా రూపొందుతోన్న ఈ చిత్రంలో అక్కినేని నాగార్జున ప్రత్యేకపాత్ర పోషిస్తున్నారు. బ్యాంకాక్ షెడ్యూల్‌లో లీకైన ధనుష్, నాగార్జున లుక్‌లకు సినిమాపై అంచానాలు పెంచాయి. ఈసారి శేఖర్ కమ్ముల హ్యాట్రిక్ కొట్టడం పక్కా అంటున్నారు. సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్మోహన్‌రావు కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రంలో రష్మిక మందన్న కథానాయిక. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ముంబయ్‌లో జరుగుతున్నది. 12రోజుల పాటు జరిగే ఈ షెడ్యూల్‌లో ధనుష్, రష్మిక, ఇతరులతో కూడిన కీలకమైన టాకీపార్ట్‌ను, కొన్ని యాక్షన్ ఎపిసోడ్స్‌ను చిత్రీకరించనున్నట్టు మేకర్స్ తెలిపారు. విజువల్‌గా వండర్ అనిపించేలా సినిమా ఉంటుందని వారు నమ్మకం వ్యక్తం చేశారు. సున్నితమైన భావోద్వేగాలతో కూడిన కథల్ని తెరకెక్కించే శేఖర్ కమ్ముల.. ఈ సారి ప్రేక్షకులు ఆశ్చర్యపోయే కొత్త కంటెంట్‌తో రానున్నారనీ, పూర్తి కమర్షియల్ హంగులతో రూపొందుతోన్న ఈ సినిమా ఓ కొత్త అనుభూతిని పంచుతుందని మేకర్స్ తెలిపారు. జిమ్ సర్బ్ కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: నికేత్ బొమ్మి, సంగీతం: దేవిశ్రీ ప్రసాద్, నిర్మాణం: శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్.ఎల్.పి, అమిగోస్ క్రియేషన్స్ ప్రై.లిమిటెడ్, సమర్పణ: సోనాలి నారంగ్.

## 'సితారే జమీన్ పర్' కోసం..

స్వీయ దర్శకత్వంలో అమీర్‌ఖాన్ నటించిన 'తారే జమీన్ పర్' (2007) చిత్రం బాక్సాఫీస్ వద్ద చక్కటి విజయాన్ని సాధించడమే కాకుండా విమర్శకుల ప్రశంసలందుకొంది. ప్రత్యేకమైన మానసిక సమస్యలతో బాధపడుతున్న పిల్లల పట్ల ప్రేమపూర్వక వైఖరి అనుసరిస్తూ వారిలోని ప్రతిభను వెలికితీయాలనే స్ఫూర్తివంతమైన కథాంశంతో అన్ని వర్గాల వారిని ఆకట్టుకుంది. ఇదే తరహా ఇతివృత్తంగా అమీర్‌ఖాన్ తాజాగా 'సితారే జమీన్ పర్' చిత్రాన్ని తెరకెక్కించబోతున్నాడు. వచ్చే నెలలో ఢిల్లీలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభంకానుంది. అమీర్‌ఖాన్‌తో పాటు పదకొండు మంది పిల్లలు ఈ సినిమాలో నటించబోతున్నారు. 'పారా ఒలింపిక్స్ నేపథ్యంలో సాగే కథ ఇది. మానసిక, శారీరకంగా దౌర్భల్యంతో ఉన్న పిల్లలను ఉత్తమ శిక్షణ అందించి, వారిలో ధైర్యాన్ని ప్రోదిచేసే మార్గదర్శి పాత్రలో అమీర్‌ఖాన్ కనిపిస్తాడు. 'తారే జమీన్ పర్' తరహాలోనే చిన్నారుల్లో స్ఫూర్తినింపే కథాంశమిది' అని చిత్ర బృందం పేర్కొంది. 'ఈ సినిమా ప్రతి ఒక్కరిని నవ్విస్తుంది, ఏడిపిస్తుంది, హృదయాలను బరువెక్కిస్తుంది' అని అమీర్‌ఖాన్ చెప్పారు.



# బహిరంగంగా అవమానించారు



'ఫిల్మ్ ఇండస్ట్రీలో బ్యాగ్రౌండ్ లేనివాళ్లకు ఎంత మర్యాద ఇస్తారో, ఎంత చులకనగా చూస్తారో నాకు బాగా తెలుసు. ఎందుకంటే నేను అనుభవించాను కాబట్టి.' అంటూ ఓ ఇంటర్వ్యూలో గత స్మృతులను గుర్తుచేసుకున్నది అందాలభామ విద్యాబాలన్. 'అది 2008. ఫిల్మ్‌ఫేర్ అవార్డుల వేడుక జరుగుతున్నది. అప్పట్లో నేను పెద్దగా మాట్లాడలేకపోయేదాన్ని. పెద్దగా చొచ్చుకుపోయే తత్వం కూడా నాది కాదు. సైలెంట్‌గా వేడుక చూస్తున్నాను. ఉన్నట్టుండి అవార్డు తీసుకోమని నన్ను స్టేజ్‌పైకి ఆహ్వానించారు. 'హేయ్ బేబీ' సినిమాలోని నా కాస్ట్యూమ్‌కి వచ్చిన అవార్డు అది. దాన్ని 'నా-రియల్' అవార్డు అంటారు. అస్సలు ప్రజాదరణ పొందని వారికి ఇచ్చే అవార్డు అది. అందరూ నవ్వుతూ నన్నే చూస్తున్నారు. ఆ సినిమాకు కాస్ట్యూమ్ డిజైనర్‌ని నేను కాదని, అవి ఆయన డిజైన్ చేసిన కాస్ట్యూమ్సనీ.. వాటితో నాకేంటి సంబంధం అని నేను చెబుతున్నా వినలేదు. చివరకు నా దర్శకుడు, కాస్ట్యూమ్ డిజైనర్‌లతో కలిసి ఈ అవార్డు తీసుకుంటాను.. అని అడిగినా ఒప్పుకోలేదు. బలవంతంగా స్టేజ్‌పై తీసుకెళ్లారు. షారుఖ్, సైఫ్ అలీఖాన్‌లు ఇద్దరూ కలిసి ఆ అవార్డు నాకందించారు. నిజం చెబుతున్నాను. ఆ రాత్రి నేను నిద్రపోలేదు. ఏడుస్తూనే ఉన్నాను. ఇలా బహిరంగంగా నన్ను అవమానించే సాహసం చేశారంటే కారణం, పరిశ్రమలో నా వెనుక ఎవ్వరూ లేకపోవడమే.' అంటూ ఆవేదన వ్యక్తపరిచారు విద్యాబాలన్.


# కడుపుబ్బా నవ్విస్తుంది



'పెళ్లి అనేది అందరూ రిలేట్ చేసుకునే అంశం. అలాగే ఈ కథలో కామెడీతోపాటు ఎమోషనల్ ఎలిమెంట్స్ కూడా చాలా ఉంటాయి. అందుకే ఈ కథను మా తొలి సినిమా కథగా ఎంపిక చేసుకున్నాం.' అని రాజీవ్ చిలక అన్నారు. అల్లరి నరేశ్, ఫరియా అబ్దుల్లా జంటగా నటించిన చిత్రం 'ఆ ఒక్కటీ అడక్కు'. మల్లి అంకం దర్శకుడు. మే 3న సినిమా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో నిర్మాత రాజీవ్ చిలక గురువారం విలేకరులతో ముచ్చటించారు. 'ఈ కథ వినగానే నా మదిలో మెదిలిన హీరో రాజేంద్రప్రసాద్‌గారు. యంగ్‌గా ఉంటే ఈ కథకు ఆయనే పర్‌ఫెక్ట్. ఇప్పుడైతే నరేశ్ తప్ప వేరే ఆప్షన్ లేదు. నరేశ్‌గారికి కూడా ఈ కథ బాగా నచ్చింది. పెళ్లి ఆలస్యమవుతుండటంతో డిప్రెషన్‌లోకి వెళ్లిపోతుంటారు కొందరు. ఈ రోజుల్లో ఆర్థికంగా సెటిల్ అవ్వడం కంటే, పెళ్లి అవ్వడం పెద్ద టాస్క్. ఒకప్పుడు చుట్టాలూ, పక్కాలు అందరూ కలిసి సంబంధాలు సెట్ చేసేవారు. ఇప్పుడు వేరే రాష్ట్రంలోనో వేరే దేశంలోనో ఉంటూ, పెళ్లికోసం వెబ్‌సైట్లను ఆశ్రయిస్తున్నారు. వాటిపైనే ఆధారపడిపోతున్నారు. మ్యాట్రీమొనీ సైట్స్ ద్వారా ప్రస్తుతం లక్షల పెళ్లిల్లు జరుగుతున్నాయి. అలా ఒక్కటైన జంటల్లో చాలామందికి ఒకరి గురించి ఒకరికి తెలీదు. ఈ నేపథ్యంలో హ్యూమర్, ఎమోషన్స్ నడుమ సాగే మంచి కథ ఇది.' అని తెలిపారు చిలక రాజీవ్. 'ఆ ఒక్కటీ అడక్కు' టైటిల్‌ని నరేశే సూచించారనీ, పెళ్లి అవ్వక బాధపడుతున్న హీరోను, పెళ్లెప్పుడని అందరూ అడుగుతుంటే.. సహజంగా పలికే డైలాగ్ 'ఆ ఒక్కటీ అడక్కు' అనీ. ఈ కథకు ఈ టైటిల్ యాప్ట్ అనీ, పైగా నరేశ్‌గారి నాన్నగారి సూపర్‌హిట్ సినిమా టైటిల్ కావడంతో ఆ సెంటిమెంట్ కూడా కలిసొచ్చిందని రాజీవ్ చిలక చెప్పారు. నటీనటులు, సాంకేతిక నిపుణులు అందరూ మనసుపెట్టి పనిచేశారనీ, రెండున్నర గంటలపాటు అందర్నీ కడుపుబ్బ నవ్వించే సినిమా ఇదని చిలక రాజీవ్ నమ్మకం వెలిబుచ్చారు.

# పౌరాణిక కథతో 'సహ్యా'

మౌనిక రెడ్డి ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'సహ్యా'. యాస రాకేష్ రెడ్డి దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. భాస్కర్ రెడ్డి నిర్మాత. ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను అగ్ర హీరో అర్జున్ విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'సరికొత్త కాన్సెప్ట్‌తో ఈ సినిమాను తెరకెక్కించాం. కథలోని పౌరాణిక నేపథ్యం ఆసక్తికరంగా ఉంటుంది. మహిళ ప్రధాన ఇతివృత్తంతో అన్ని వర్గాలను ఆకట్టుకుంటుంది' అన్నారు. త్వరలో టీజర్, ట్రైలర్‌ను విడుదల చేస్తామని నిర్మాత భాస్కర్ రెడ్డి తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: అరుణ్ కోలుగురి, సంగీతం: రోహిత్ జిల్లా, దర్శకత్వం: యాస రాకేష్ రెడ్డి.





# ఓటీటీలో అలరిస్తున్న 'ఏంచేస్తున్నావ్'?

ఓటీటీలో విడుదలై ప్రజాదరణ పొందుతున్న చిత్రం 'ఏం చేస్తున్నావ్?'. విజయ్ రాజ్‌కుమార్, నేహా పతన్, అమితా రంగనాథ్ ప్రధాన పాత్రధారులు. భరత్ మిత్ర దర్శకుడు. నవీన్ కురువ, కిరణ్ కురువ నిర్మాతలు. ఓటీటీలో ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటున్న ఈ సినిమా గురించి దర్శకుడు మాట్లాడుతూ 'నా నిర్మాత నవీన్ వల్లే ఈ సినిమా నేను తీయగలిగాను. ఒక చిన్న ఊరిలో బట్టలకొట్టు పెట్టుకొని దాంట్లో వచ్చిన లాభాలను పైసా పైసా దాచి, ఈ సినిమా తీశారు. సినిమాను ఓటీటీలో పెద్ద హిట్. విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అన్నారు. ఇంకా ఆమని, రాజీవ్ కనకాల, తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: ప్రేమ్ అడివి, సంగీతం: గోపీసుందర్, నిర్మాణం: యెన్విఆర్ ప్రొడక్షన్స్, సిడ్స్ క్రియేటివ్ వరల్డ్.